## క్లుప్తంగా

### గంజాయి విక్రయాలపై ఎక్సైజ్ అధికారుల తనిఖీలు

ప్రొద్దుటూరు క్రైం : గంజాయి విక్రయాలపై ప్రొద్దుటూరు ఎక్సైజ్ అధికారులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. గంజాయి వాడకం, వ్యాపారాలపై ఆదివారం సాక్షిలో' దమ్ మారో దమ్' అనే శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనికి స్పందించిన ఎక్సైజ్ సీఐ సురేంద్రారెడ్డి సిబ్బందితో కలిసి ప్రొద్దుటూరులోని పలు ప్రాంతాల్లో సోమవారం తనిఖీలు చేశారు. ఆర్టీసీ బస్టాండు, పాత బస్టాండు, రైల్వే స్టేషన్‌లతో పాటు ఉప్పాగు, శ్రీనివాసనగర్, మోడంపల్లె, రామేశ్వరం ప్రాంతాల్లో ఉన్న పాత నిందితుల కదలికలపై ఆరా తీశారు. ఎవరైనా గంజాయి విక్రయిస్తే సమాచారం అందించాలని ఆయా ప్రాంతాల ప్రజలను కోరారు.

### బిందు, తుంపర్ల సేద్యంపై అవగాహన, శిక్షణ

పోరుమామిళ్ల : రంగసముద్రం రైతుసేవాకేంద్రంలో సోమవారం వ్యవసాయ, ఉద్యాన గ్రామ సహాయకులకు బిందు, తుంపర్ల సేద్యంపై శిక్షణ, అవగాహన కల్పించారు. జిల్లా పథక సంచాలకులు వెంకటేశ్వరరెడ్డి 2025–26 ఆర్థిక సంవత్సరానికి బిందు, తుంపర్ల సేద్య పరికరాలు కావాల్సిన రైతులను గుర్తించి వారికి అవగాహన కల్పించాలన్నారు. డ్రిప్ ఇరిగేషన్ పద్ధతి, ఫర్టిగేషన్ పద్ధతి, పరికరాల అమరికల గురించి వివరించారు. రాయితీ గురించి, దరఖాస్తు చేయడంపై ఆయన వివరించారు. కార్యక్రమంలో పోరుమామిళ్ల ఏడిఎ మురళీధర్‌రెడ్డి, వ్యవసాయాధికారులు చంద్రమోహన్, చంద్రమోహన్ రెడ్డి, ఉద్యానాధికారి శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

### 18న ఉచిత వైద్య శిబిరం

ప్రొద్దుటూరు : మండలంలోని దొరసానిపల్లె జెడ్పీహైస్కూల్‌లో ఈనెల 18న గురువారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 4 గటల వరకు శివదర్శనానంద స్పిరిచ్యువల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు శివదర్శనానంద సరస్వతీ మాతాజీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరంలో ప్రముఖ డాక్టర్లు టీడీ వరుణ్‌కుమార్ రెడ్డి, సత్యప్రవీణ్, ఎ.వెంకటరాముడు, జీపీ సంధ్యారాణి, బొలిశెట్టి శ్రీలక్ష్మి ప్రజలకు వైద్య సేవలు అందిస్తారని ఆమె వివరించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### బాధ్యతలు స్వీకరించిన సబ్‌డీఎఫ్ఓ

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు సబ్‌డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్‌గా మహారాష్ట్రకు చెందిన సంకేత్ సునీల్ గరుడ్ సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ సబ్‌డీఎఫ్ఓగా పనిచేస్తున్న దివాకర్ ఇటీవల బదిలీ అయ్యారు. 2023 ఐఎఫ్ఎస్ బ్యాచ్‌కు చెందిన సంకేత్ సునీల్ ట్రైనింగ్ అనంతరం ప్రొద్దుటూరు సబ్‌డీఎఫ్ఓగా నియమితులయ్యారు. సబ్ డివిజనల్ కార్యాలయంలో బాధ్యతలు తీసుకున్న ఆయనకు ఎఫ్ఆర్ఓ హేమాంజలి, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన కడప డీఎఫ్ఓ వినీత్‌కుమార్‌ను కలిశారు.

బ్రహ్మంగారిమఠం : మండలంలోని సోమిరెడ్డిపల్లె(బి.మఠం) మేజర్ గ్రామ పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శిగా వెంకటసుబ్బయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సోమిరెడ్డిపల్లె పంచాయతీలో బ్రహ్మంగారిమఠం కూడా ఉండడంతో పారిశుధ్యంపై ప్రత్యేక చొరవ తీసుకుంటానని ఆయన తెలియజేశారు.

### రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

రాజుపాళెం : మండలంలోని తొండలదిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్ఎం లక్ష్మి నారాయణ రెడ్డి, పీఈటీ జిలాన్ బాషా తెలిపారు. వారు ఆ పాఠశాలలో సోమవారం మాట్లాడుతూ గత శుక్రవారం కడపలో జరిగిన పోటీలలో మంచి ప్రతిభ కనబరచిన ఐదు మంది విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. అండర్–14 బాలుర విభాగంలో సుశాంత్, సుభాష్, బాలికల విభాగంలో ప్రశాంతి, అండర్–17 బాలికల విభాగంలో పోలమ్మ, బాలుర విభాగంలో జితేంద్రలు ఎంపికయ్యారని పేర్కొన్నారు.

### ఇంటి స్థలాలు ఇవ్వాలి

అట్లూరు : అట్లూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో అర్హులైన పేదలందరికీ వ్యవసాయ భూములు, ఇంటి స్థలాలు ఇవ్వాలని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పి.చాంద్‌బాషా, మండల కార్యదర్శి రమణయ్య మాట్లాడుతూ మండలంలోని అనేక సర్వే నంబర్లలో వందలాది ప్రభుత్వ భూములు ఖాళీగా ఉన్నాయన్నారు. అర్హులైన పేదలకు హెక్టారు వ్యవసాయ భూమి, మూడు సెంట్ల ఇంటి స్థలం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ సుబ్బలక్ష్మమ్మకు వినతిపత్రం అందించారు. సీపీఎం నాయకులు దుర్గమ్మ, స్వప్న, సరస్వతి, ఆదిలక్షుమ్మ, రవిచంద్ర, రామసుబ్బయ్య పాల్గొన్నారు.

### డబ్బు చెల్లించాకే ఎగ్జిబిషన్ నిర్వహించాలి

ప్రొద్దుటూరు : మున్సిపాలిటీకి కాంట్రాక్టర్ వేలం పాటలో పాడిన పూర్తి డబ్బు చెల్లించాకే ఎగ్జిబిషన్‌ను అప్పగించాలని ప్రొద్దుటూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఇర్ఫాన్ బాషా ఒక ప్రకటనలో తెలిపారు. ఆ విధంగా మున్సిపల్ కమిషనర్ ఎన్‌ఓసీ విడుదల చేయాలని ఆయన పేర్కొన్నారు.

# యువ ఇంజినీర్లకు మోక్షగుండం ఆదర్శం



ప్రొద్దుటూరు : ఇంజినీర్లను సన్మానిస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు



ప్రొద్దుటూరు : మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న అధ్యాపకులు

ప్రొద్దుటూరు : యువ ఇంజినీర్లు మోక్షగుండం విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకుని ఆయన అడుగుజాడల్లో నడవాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి, డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక కొర్రపాడు రోడ్డులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని కళాశాల ప్రిన్సిపాల్ గురుమూర్తి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విశ్వేశ్వరయ్య శిలా చిత్రానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ విశ్వేశ్వరయ్య గొప్ప ఇంజినీర్ అని ఆయనను భారతీయ ఇంజినీరింగ్ పితామహుడు అని కొనియాడారు. తిరుమల తిరుపతి రహదారి ఘాట్ రోడ్డు నిర్మించారని, ఎన్నో నగరాలకు మంచినీటి సౌకర్యాన్ని, మురుగునీటి పారుదల సౌకర్యాల ప్రణాళికలను సూచించారన్నారు. కళాశాల అధ్యాపకులు పంగా సురేంద్రరెడ్డి, మంజునాథ్, వీరభద్రా రెడ్డి, అశోక్‌బాబు, శ్రీనుబాబు, విజయకుమార్‌తో పాటు బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

**ఘనంగా ఇంజినీర్ల దినోత్సవం**

స్థానిక వైఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ఇంజినీర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతిప్రజ్వలన అనంతరం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బి.జయరామిరెడ్డి మాట్లాడుతూ విశ్వేశ్వరయ్య సామాన్య కుటుంబంలో పుట్టి స్వయం కృషితో ఉన్నత స్థాయి సాంకేతిక ప్రజ్ఞ మూర్తిగా పేరుగడించారన్నారు. కళాశాల డీన్ ఆచార్య జయచంద్రారెడ్డి, ఆచార్య సి.నాగరాజు, ఆచార్య కేవీ రమణయ్య పాల్గొన్నారు.

**ఇంజినీర్లకు సన్మానం**

స్థానిక రోటరీ క్లబ్ సమావేశ మందిరంలో సోమవారం మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని రోటరీక్లబ్, రోటరీ ట్రస్టు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఇంజినీర్ జి.ప్రభాకర్‌రెడ్డి, ప్రొద్దుటూరు నార్త్ డివిజన్ అసిస్టెంట్ ఇంజినీర్ అబ్దుల్ జబ్బార్‌లను ఘనంగా సత్కరించారు. రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ గజ్జల వెంకటేశ్వరరెడ్డి, సెక్రటరీ షేక్ బాబా, పీడీజీ ఎంవీఎస్ ప్రభు,రోటరీ క్లబ్ మాజీ ప్రెసిడెంట్లు, సీనియర్ రొటేరియన్స్ డాక్టర్ బి.రాజారామ్మోహన్‌రెడ్డి, టి.బాలసూర్యారావు, పెంచలయ్య, మహమ్మద్ అయూబ్ ఖాన్, మాజీ సెక్రటరీ గండూరు శ్రీధర్‌శర్మ, ఖాదర్‌బాషా, డాక్టర్ జ్యోతి, మెహతాబ్ నూర్జహాన్ పాల్గొన్నారు.

**పర్యావరణ పరిరక్షణలో కీలకపాత్ర పోషించాలి**

చాపాడు : భవిష్యత్తులో కాబోయే యువ ఇంజనీర్లు పర్యావరణ పరిరక్షణలో కీలకపాత్ర పోషించాలని ఆర్‌అండ్‌బీ ఎస్ఈ చంద్రశేఖర్ తెలిపారు. స్థానిక సీబీఐటీలో సోమవారం భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని 58వ ఇంజనీర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరయ్య దేశం గర్వించదగ్గ అనేక రకాలైన కట్టడాలను నిర్మించి సివిల్ ఇంజనీర్‌గా మంచి పేరు తెచ్చుకున్నారన్నారు. సీబీఐటీ డైరెక్టర్ అడ్మిన్ డాక్టర్ జి.శ్రీనివాసులరెడి, సీబీఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శృతి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

**కొత్త ఆవిష్కరణలు చేయాలి**

మైదుకూరు : విద్యార్థులు భావిభారత ఇంజనీర్లుగా మారి కొత్త ఆవిష్కరణలు చేయాలని రైల్వే శాఖ విశ్రాంత చీఫ్ మెకానికల్ ఇంజనీర్ జి.అప్పారావు పేర్కొన్నారు. భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని సోమవారం మైదుకూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఇంజనీర్స్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం విశ్రాంత ఇంజనీర్ అప్పారావు మాట్లాడుతూ విద్యార్థులందరూ శ్రద్ధగా చదువుకొని దేశానికి నిస్వార్థంగా సేవ చేయాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపల్ డాక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జీవిత విశేషాలను ఆయన దేశానికి, మన రాష్ట్రానికి చేసిన సేవలను గుర్తు చేశారు. అధ్యాపకులు పార్థసారథి, శివ కుమార్, చంద్రశేఖర్, మహేష్ పాల్గొన్నారు.

## ప్రత్యామ్నాయం కల్పిస్తాం..ఆక్రమణలు తొలగిస్తాం



గ్రామసభలో మాట్లాడుతున్న ఆర్డీఓ చంద్రమోహన్

గోపవరం : బద్వేలు మున్సిపాలిటీ గోపవరం, బద్వేలు రెవెన్యూ పరిధిలో ఉన్న నాగులచెరువు ఆక్రమణలు తొలగించే విషయంపై సోమవారం ఆర్డీఓ చంద్రమోహన్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల లెక్కల ప్రకారం దాదాపు 182 ఎకరాలు నాగులచెరువు ఆయకట్టు కలిగి ఉందన్నారు. అధిక శాతం చెరువు ఆక్రమణకు గురి కావడం జరిగిందని, గతంలో అనేకమార్లు ఆక్రమణలు తొలగించే విషయంలో అధికారులు ప్రయత్నించినప్పటికీ కార్యరూపం దాల్చలేదన్నారు. సీపీఐ, వివిధ ప్రజా సంఘాల నాయకుల ఆధ్వర్యంలో భూపోరాటం ద్వారా పేదల చేత చెరువు ఆయకట్టులో గుడిసెలు వేయించారని, అప్పటి నుండి ఇప్పటి వరకు అక్కడే పేదలు నివసిస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో చెరువు ఆక్రమణలు తొలగించి పూర్తిస్థాయిలో చెరువు ఆయకట్టును కాపాడాలని ఇటీవల కోర్టులో ప్రైవేటు వ్యాజ్యం చేయడం జరిగిందని, దీంతో హైకోర్టు కూడా అక్కడ ఉన్న పేదలకు ప్రత్యామ్నాయం కల్పించి ఆక్రమణలను తొలగించాలని స్పష్టమైన ఆదేశాలను జిల్లా కలెక్టర్‌కు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రస్తుతం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ గ్రామసభ నిర్వహించి చెరువు ఆక్రమణలో ఎవరైతే ఇళ్లు నిర్మించుకున్నారో వారి వివరాలను సేకరించనున్నట్లు ఆర్డీఓ తెలిపారు. ఇంతలో సీపీఐ నాయకులు కలుగజేసుకుని నాగులచెరువు ఆక్రమణలో పెద్దలను వదిలేసి పేదల జోలికి రావడం ఎంత వరకు సబబు అని అధికారులను ప్రశ్నించారు. ఈ విషయంలో ఆర్డీఓ కలుగజేసుకుని చెరువు ఆక్రమణను తొలగించే విషయంలో ధనికులు, పేదలంటూ తేడా ఉండదన్నారు. ఎవరైతే ధనికులు చెరువును ఆక్రమించి ఉంటారో అక్కడి నుండే ఆక్రమణలను తొలగించే కార్యక్రమం మొదలుపెడతామని, ఈ విషయంలో ఎలాంటి సందేహం పెట్టుకోవదన్నారు. గ్రామసభలో ఇరిగేషన్ ఏఈ రామ్మోహన్‌రెడ్డి, గోపవరం, బద్వేలు తహసీల్దార్లు త్రిభువన్ రెడ్డి, ఉదయభాస్కర్‌రాజు, బద్వేలు అర్బన్ సీఐ లింగప్ప, ఏపీఎస్‌పీడీసీఎల్ ఏఈ శివకుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## పాఠశాల మారిస్తే ఆందోళనలు

చాపాడు : మండలంలోని చియ్యపాడు గ్రామ అరుంధతివాడలోని ప్రాథమిక పాఠశాలను కొనసాగించాలని, లేకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి హరిబాబు పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ చియ్యపాడు అరుంధతివాడలో గత 40 ఏళ్లుగా ఉన్న పాఠశాలను తొలగించాలని అనుకోవడం సమంజసం కాదన్నారు. జిల్లా మండల విద్యాశాఖ అధికారుల స్వార్థ ప్రయోజనాల కోసం పిల్లల భవిష్యత్తును నాశనం చేస్తున్నారని ఆరోపించారు. స్కూల్ మార్పు వద్దని గత మూడు నెలలుగా గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేదని, దీంతో ఇప్పటికే పిల్లలకు మధ్యాహ్న భోజనం అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి పాఠశాలను అక్కడే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్బయ్య, జిల్లా కమిటీ సభ్యులు శివ పాల్గొన్నారు.

## శ్మశానానికి దారి చూపించండి

కలసపాడు : మండలంలోని దిగువ తంబళ్లపల్లె దళితుల శ్మశానానికి దారి చూపించాలని సోమవారం తహసీల్దారుకు ఆ గ్రామ దళితులు వినతిపత్రం అందజేశారు. ఎవరైనా మృతిచెందితే శ్మశానికి దారి లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. అలాగే దారికి ఇరువైపులా రోడ్డును పొలాల యజమానులు ఆక్రమించుకున్నారని, దీంతో శ్మశానికి వెళ్ళేందుకు దారి కుదించుకుపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. అధికారులు స్పందించి శ్మశానానికి దారి చూపించాలని వారు వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో ఓబులేసు, యర్రయ్య, బాలయ్య, రవి, బాబు పాల్గొన్నారు.

## ఆర్ఎంపీలు ప్రాథమిక చికిత్స మాత్రమే చేయాలి

మైదుకూరు : ఆర్ఎంపీలు కేవలం ప్రాథమిక చికిత్స మాత్రమే చేయాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ వి.మల్లేష్ అన్నారు. సోమవారం మైదుకూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రథమ చికిత్స కేంద్రం అని మాత్రమే బోర్డుపై రాయాలని పేర్కొన్నారు. బోర్డుపై ఆర్ఎంపీ పేరుకు ముందు డాక్టర్ అనే పదాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపయోగించకూడదని స్పష్టం చేశారు. కేవలం చిన్నపాటి రోగాలు, గాయాలకు మాత్రమే ఆర్ఎంపీలు చికిత్స చేయాలన్నారు. జ్వరం, దగ్గు, జలుబు వంటి సాధారణ సమస్యలకు ప్రాథమిక మందులను ఇవ్వాలని తెలిపారు. వైద్యం, ఆరోగ్యంపై ప్రాథమిక సలహాలు ఇవ్వడం, పౌష్టికాహారం, పరిశుభ్రత ఆవశ్యకత గురించి ప్రజలకు అవగాహన కల్పించవచ్చని తెలిపారు. క్లిష్టమైన రోగాలతో బాధపడుతున్న వారిని, శస్త్రచికిత్స అవసరమైన రోగులను పెద్ద ఆస్పత్రులకు, ప్రత్యేక వైద్య నిపుణుల వద్దకు పంపించాలన్నారు. క్యాన్సర్, గుండె జబ్బులు, కిడ్నీ సమస్యలు వంటి వాటికి చికిత్స చేయకూడదని తెలిపారు. నిబంధనలను ఉల్లంఘిస్తే ప్రథమ చికిత్స కేంద్రాన్ని సీజ్ చేసి, సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఆటో కార్మికులకు రూ.50 వేలు ఇవ్వాలి

పోరుమామిళ్ల : ప్రతి ఆటో కార్మికునికి ప్రభుత్వం రూ. 50 వేలు ఇవ్వాలని ఏఐటీయూసీ మండల అధ్యక్షులు, సీపీఐ మండల కార్యదర్శి రవికుమార్ కోరారు. సోమవారం ఈ మేరకు అంబేడ్కర్ సర్కిల్ నుండి ర్యాలీ నిర్వహించి తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో ఆటోలకు ఆదాయం పడిపోయిందన్నారు. ఆటో డ్రైవర్ల కుటుంబాలు రోడ్డు పాలు అయ్యే పరిస్థితి నెలకొందన్నారు. నిత్యావసర వస్తువులు, డీజిల్, పెట్రోల్ రేట్లు తగ్గించాలని, ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి నెలకు రూ. 5 వేలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కేశవ, అబ్దుల్ ఖాదర్, చంద్ర, వెంకటేశ్వర్లు, నర్సింహులు, గురప్ప, లాజర్ తదితరులు పాల్గొన్నారు.

## కుటిల రాజకీయాలకు విద్యార్థులను బలిచేయొద్దు



రెడ్యం వెంకటసుబ్బారెడ్డి

ఖాజీపేట : పేదలకు వైద్య విద్యను దూరం చేసే కుట్రలకు కూటమి ప్రభుత్వం దిగుతోందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి ఆరోపించారు. దుంపలగట్టు గ్రామంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నేషనల్ మెడికల్ కమిషన్ ప్రస్తుత విద్యా సంవత్సరానికి 50 మెడికల్ సీట్లను గత సంవత్సరమే మంజూరు చేసినా, చంద్రబాబు ప్రభుత్వం సీట్ల కేటాయింపు రద్దు చేయించేలా లేఖ రాశారని గుర్తు చేశారు. దీంతో పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలకు వైద్య విద్య అందకుండా చంద్రబాబు నాయుడు వ్యవహరించారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌కు ఎక్కడ పేరు వస్తుందోనన్న అభిప్రాయంతో విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటుండటాన్ని ఖండించారు. పులివెందుల మెడికల్ కాలేజీ పనులపై కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక కాస్త శ్రద్ధ చూపిన ఈ విద్యా సంవత్సరంలో ఎంబీబీఎస్ తరగతులు జరిగేవని ఆయన తెలియజేశారు. తమ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌పై ద్వేషం ఉంటే చంద్రబాబు రాజకీయంగా ఎదుర్కోవాలే కానీ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. జగన్ ఎంతో దూరదృష్టితో ఏర్పాటు చేసిన వైద్య కళాశాల కూటమి కుటిల రాజకీయాలకు బలి అవుతుండటం ప్రజలకు నష్టమేనని పేర్కొన్నారు.

## నిధుల కొరతతో నిలిచిన పనులు

బ్రహ్మంగారిమఠం : మండలంలో నూతనంగా నిర్మిస్తున్న అంగన్‌వాడీ భవనాలు నిధుల కొరతతో అర్ధంతరంగా నిలిచిపోయాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మండలంలో లింగాదిన్నెపల్లె, కొత్తబస్వాపురం, ముడుమాల, ఎద్దలాయపల్లె, గ్రామాల్లో సొంత భవనాలకు నిధులు కేటాయించారు. భవనాలు కూడా దాదాపు పూర్తయ్యే దశకు చేరుకున్నాయి. ఇంతలో ఎన్నికలు రావడంతో నిధులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటుతున్నా ఇంతవరకు ఎలాంటి నిధులు విడుదల చేయకపోవడంతో నిర్మాణంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల పనులు నిలిచిపోయాయి. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు ఇబ్బందులు పడుతున్నారు. భవనానికి కొన్ని పరికరాలు ప్రభుత్వం ఇవ్వాల్సి ఉంది. అవి కూడా ఇవ్వకుండా కాలయాపన చేయడంతో పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి.

## స్థానిక సంస్థల ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించాలి



నాగార్జునరెడ్డి

పోరుమామిళ్ల : స్థానిక సంస్థల ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించాలని ప్రభుత్వ మాజీ సలహాదారు నాగార్జున రెడ్డి కోరారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఎన్నికల మాదిరి కాకుండా అధికారులు, పోలీసులు ప్రజల విశ్వాసాన్ని, నమ్మకాన్ని చూరగొనాలన్నారు. ఇప్పుడు జరగనున్న ఎన్నికలను దేశం యావత్తూ, విదేశాల్లో ఉన్న మన తెలుగువారు అందరూ గమనిస్తారన్నారు. ఏపీ ఎన్నికల షెడ్యూల్ ఎన్నికల కమీషనర్ నీలం సాహ్ని ప్రకటించారని, అక్టోబర్ 15 లోగా ఓట్ల పునర్విభజన, రిజర్వేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని, అక్టోబర్ 16 నుండి నవంబర్ 15 లోగా వార్డుల వారీగా ఓటర్ల లిస్టు సిద్ధం చేయాలని, నవంబర్ 1 నుండి 15 లోగా అధికారుల నియామకం పూర్తి చేయాలని షెడ్యూలు విడుదల అయిందన్నారు. డిసెంబర్ 15 లోపు పంచాయతీ సర్పంచుల రిజర్వేషన్ ప్రక్రియ పూర్తి చేసి జనవరిలో నాలుగు దశల్లో ఎన్నికలు పూర్తి చేస్తారని ప్రకటించాలన్నారు. ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు సిద్ధం కావాలని నాగార్జునరెడ్డి పిలుపిచ్చారు. గ్రామాల్లో, పట్టణాల్లో వైఎస్సార్‌సీపీ బలంగా ఉందని కూటమి ప్రభుత్వంపై ప్రజలు అసంతృప్తిగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. ఎన్నికలను ఈవీఎంల ద్వారా కాకుండా బ్యాలెట్ పేపర్ ద్వారా నిర్వహించాలన్నారు.

## యూరియా సమస్యలు ప్రభుత్వానికి కనిపించడం లేదా?

వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ రెడ్డి



చాపాడు : రాష్ట్ర వ్యాప్తంగా యూరియా కోసం రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారని, రైతుల సమస్యలు సీఎం చంద్రబాబు, జిల్లా కలెక్టర్లకు కనిపించడం లేదా అని వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు సంబటూరు ప్రసాద్ రెడ్డి ప్రశ్నించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటికే ఏ పంటకు గిట్టుబాటు ధరలు లేక రైతులు అల్లాడిపోతున్నారన్నారు. ప్రస్తుతం పంటలు పండించుకునేందుకు యూరియా దొరకకపోవడంతో అవస్థలు తప్పడం లేదని చెప్పారు. రైతులకు సరిపడా యూరియాను ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా అందించాలని డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా 428 మంది రైతు భరోసా కేంద్రాలు ఉన్నప్పటికీ రైతులకు ఉపయోగపడం లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఆయా జిల్లాల కలెక్టర్లు స్పందించి రైతుల అభిప్రాయాల మేరకు వారికి అవసరమైన ఎరువులను అందించాలని తెలియజేశారు. రైతులపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఇప్పటికైనా వారికి అవసరమైన యూరియాను అందించి, పండించిన ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు.

## ఆటో కార్మికుల నిరసన

ప్రొద్దుటూరు : స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో ఆటో కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పి.సుబ్బరాయుడు, యూనియన్ పట్టణ ప్రధాన కార్యదర్శి వై.హరి మాట్లాడుతూ ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. లైసెన్స్ కలిగిన ప్రతి డ్రైవర్‌కు వాహన మిత్ర పథకాన్ని అమలు చేస్తామని చెప్పి, ఇప్పుడు ఓనర్ కం డ్రైవర్‌కు మాత్రమే పథకాన్ని వర్తింపజేస్తామని చెప్పడం సరికాదన్నారు. యూనియన్ నాయకులు శ్రీను, బాబు, హుస్సేన్‌బాషా, ఆదినారాయణ, దస్తగిరి పాల్గొన్నారు.

## గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి

కలసపాడు : గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సచివాలయ ఉద్యోగుల ఐక్య సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు పి.సిద్దేశ్వరరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆశయమైన విజన్ 2047 లక్ష్యసాధన కోసం అభివృద్ధిలో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను భాగస్వామ్యం చేసి వినియోగించుకోవాలన్నారు. వలంటీర్ నిధులలైన ఇంటింటికి తిరిగే సర్వేల నుండి విముక్తి కలిగించాలని, స్పష్టమైన జాబ్‌కార్డు అమలు చేయాలని కోరారు. సచివాలయ ఉద్యోగుల ప్రొబేషన కాలానికి సంబంధ/ంచి నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలన్నారు. అక్టోబర్ నాటికి 6 సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసుకొనే వారికి ఆటోమేటిక స్పెషల్ గ్రేడ్ ఇంక్రిమెంట్ ఇవ్వాలన్నారు. సచివాలయ ఉద్యోగులకు శాఖలవారీగా ప్రమోషన్ ఛానల్ ఏర్పాటు చేసి త్వరితగిన పదోన్నతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో న్యాయం జరగకపోతే రాష్ట్ర జేఏసీ కార్యాచరణకు అనుగుణంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం ఎంపీడీఓ మహబూబ్‌బీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల ఏజేసీ నాయకులు రాజేష్, యశ్వంత్‌సాయి, నరసింహ, త్రివేణి, మేఘన తదితరులు పాల్గొన్నారు.

## వృత్తి ధర్మాన్ని నిర్వహిస్తూనే హక్కుల కోసం పోరాటం

పోరుమామిళ్ల : ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయడంలో ఉపాధ్యాయులు వృత్తి ధర్మాన్ని శ్రద్ధతో నిర్వహిస్తూనే హక్కుల కోసం పోరాటాలు చేయాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం పోరుమామిళ్లలో 2025 డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఎంపిక అయిన అభ్యర్థులకు నిర్వహించిన అభినందన సభ లో ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. పోరు మామిళ్లలో శిక్షణ తీసుకుని 125 మంది అభ్యర్థులు డీఎస్సీకి ఎంపిక కావడంలో కోచింగ్ యాజమాన్యం చేసిన కృషి అభినందనీయమన్నారు. అన్ని రంగాల్లో విద్యా, వైద్య రంగాలు ప్రధానమైనవని విద్యారంగాన్ని బలోపేతం చేసే క్రమంలో కాబోయే ఉపాధ్యాయులు పేద బడుగు బలహీన వర్గాల పిల్లలకు చక్కటి విద్యాబోధన చేయాలన్నారు. సభలో రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.రమణారెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల, విద్యారంగ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఆవిర్భవించిన ఎస్టీయులో నూతన ఉపాధ్యాయులు సభ్యులుగా చేరాలన్నారు. వృత్తిపరమైన సర్వీసు విషయంలో, ససమస్యల పరిష్కారంలో ఎస్టీయూ అండగా ఉంటుందన్నారు. అనంతరం డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయ అభ్యర్థులను శాలువా, మెమొంటోలతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు కుళ్లాయప్ప, చంద్రహాస్‌రెడ్డి, బాలరాజు, చంద్రశేఖర్, కృష్ణారెడ్డి, ఆనంద్, బాల ఓబయ్య, రవీంద్రబాబు, అభ్యర్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

## బస్తా యూరియా కోసం బారెడు నిబంధనలు



రైతు సేవా కేంద్రం వద్ద యూరియా కోసం క్యూలో ఉన్న రైతులు

దువ్వూరు : రైతులకు యూరియా తిప్పలు తప్పడం లేదు. సోమవారం మండలంలో 32 టన్నుల యూరియాను పంపిణీ చేశారు. దువ్వూరు–2, చింతకుంట–2 రైతు సేవా కేంద్రాలు, దువ్వూరులోని ప్రైవేట్ ట్రేడర్స్ ద్వారా 32 టన్నుల యూరియాను అధికారులు పంపిణీ చేశారు. ఉదయం నుంచే రైతులు దువ్వూరు బైపాస్ రోడ్డులోని సచివాలయం వద్ద బారులు తీరారు. రైతులకు ఇచ్చే ఒకటి, రెండు బస్తాల యూరియా కోసం అధికారులు రైతులకు అనేక మెలికలు పెట్టారు. దీంతో పంపిణీ కేంద్రాల వద్ద స్వల్ప వాగ్వాదం చోటు చేసుకుంది. అధికారుల తీరుపై రైతలు అసహనం వ్యక్తం చేశారు. యూరి యా రాత్రిళ్లు అక్రమంగా తరలిపోతుంటే అధికారులు పట్టించుకోవడం లేదని, కానీ రైతులకు ఇచ్చే యూరియాపై ఇన్ని ఆంక్షలు పెట్టడం ఏమిటని రైతులు ప్రశ్నించారు. రైతులకు న్యాయం చేయాల్సిన వ్యవసాయాధికారి సహనం కోల్పోయి రైతులను పోలీసులతో కలిసి ఇక్కడి నుంచి వెళ్లండని తోసేయించారు. అక్కడే ఉన్న సాక్షి ప్రతినిధి సార్ మీరు ఎందుకు రైతులను తోస్తున్నారు.. వారు ఏ తప్పు చేశారు.. వారి సమస్యకు పరిష్కారం చెప్పాలని ఏఓను అడగగా, ఇవ్వం.. కుదరదు మీరు ఈ విషయంలో కలుగజేసుకోవద్దని దురుసుగా మాట్లాడారు. దువ్వూరు మండలానికి ఇప్పటి వరకు 1000 టన్నుల యూరియా వచ్చిందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. రైతులకు ఎంత మేర యూరి యా అందింది? అంత యూరియా వచ్చినా మండలంలో ఇంత డిమాండ్ ఎందుకు ఉందో అధికారులు సమాధానం చెప్పాలని రైతులు కోరుతున్నారు.

## నోటీసుల పేరుతో భయభ్రాంతులకు గురిచేయడం తగదు

బద్వేలు అర్బన్ : పోరుమామిళ్ల బైపాస్ రోడ్డులోని భగత్‌సింగ్‌నగర్‌లో గల 11 ఏళ్ళుగా స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకున్న పేదలను రెవెన్యూ అధికారులు నోటీసుల పేరుతో భయభ్రాంతులకు గురిచేయడం తగదని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర పేర్కొన్నారు. ఇటీవల రెవెన్యూ అధికారులు భగత్‌సింగ్‌నగర్ వాసులకు నోటీసులు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరుమామిళ్ల బైపాస్ రోడ్డులో నిరుపయోగంగా ఉన్న స్థలంలో 11 ఏళ్ళ క్రితం పేదలు గుడిసెలు వేసుకుని నేడు లక్షల రూపాయలు ఖర్చు పెట్టి పక్కా గృహాలు నిర్మించుకుని నివసిస్తుంటే మౌళిక వసతులు కల్పించాల్సిన అధికారులు నోటీసులు ఇవ్వడం సరికాదన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరశేఖర్, ఏరియా సహాయ కార్యదర్శి మస్తాన్, పట్టణ కార్యదర్శి బాలు, పట్టణ సహాయ కార్యదర్శులు నాగేశం, నాగరాజు, ఏరియా కార్యవర్గ సభ్యులు పి.వి. రమణ, పెంచలయ్య, విజయమ్మ పాల్గొన్నారు.

## పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వాలని ధర్నా

గోపవరం : బద్వేలు పట్టణంలోని సుందరయ్యనగర్‌లో నివాసముంటున్న ప్రతి కుటుంబానికి పొజిషన్ సర్టిఫికెట్ ఇవ్వడంతో పాటు పక్కాగృహాలు, శ్మశానవాటిక, కరెంటు మీటరు ఇవ్వాలని సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం గోపవరం రెవెన్యూ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ సుందరయ్యనగర్‌లో నివాసముంటున్న పేదలకు కనీస మౌళిక సదుపాయాలు కల్పించాలన్నారు. 2001లో భూపోరాటం నిర్వహించి దాదాపు 3600 కుటుంబాలకు ఇళ్ళస్థలాలు పంపిణీ చేయడం జరిగిందని, అప్పటి నుండి వారు అక్కడే నివాసం ఉంటున్నారని, ఎన్ని ప్రభుత్వాలు మారినా వారికి మౌళిక వసతులు కల్పించలేదన్నారు.

## దోమకాటు బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలి

బద్వేలు అర్బన్ : దోమకాటు బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సబ్ యూనిట్ అధికారి ఐ.సుబ్బరాయుడు అన్నారు. పట్టణంలోని విద్యానగర్, మహబూబ్‌నగర్ పరిధిలోని మురికి నీటి కుంటల్లో సోమవారం దోమల నివారణకు ఆయిల్‌బాల్స్ వేయడంతో పాటు కీటక జనిత వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారంలో ఒక రోజు డ్రైడే పాటించడంతో పాటు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమలను నివారించవచ్చని అన్నారు. అలాగే ఇంటి పరిసరాలలోని డ్రమ్ముల్లో, ఎండిన కొబ్బరిబోండాల్లో, టైర్లలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని కోరారు. దోమల బారిన పడకుండా దోమతెరలు వాడాలని సూచించారు. అనంతరం లార్వా, ఫీవర్‌సర్వే నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్ శివరామిరెడ్డి, హెల్త్ అసిస్టెంట్‌లు జనార్ధన్‌రావు, శ్రీరాములయ్య, వెంకటసుబ్బయ్య, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

## పశువైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి

బద్వేలు అర్బన్ : రైతులు పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకుని పశువులను సంరక్షించుకోవాలని మండల పశువైద్యాధికారులు డాక్టర్ లక్ష్మీనరసయ్య, డాక్టర్ పవన్‌కుమార్, డాక్టర్ నరసింహారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని చింతపుత్తాయపల్లె గ్రామంలో సోమవారం రాష్ట్రీయ గోకుల్‌మిషన్, పశుసంవర్ధకశాఖ, పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరంలో వారు మాట్లాడుతూ పశువులన్నింటికి సకాలంలో టీకాలు వేయించడంతో పాటు వ్యాధులు ప్రబలకుండా పశువులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. అలాగే పశువులు ఎదకు రావడానికి, ఎద లక్షణాలు, లింగ నిర్ధారిత ఎద సూది ప్రాముఖ్యతను వివరించారు. ఈ శిబిరంలో 32 గేదెలకు గర్భకోశ వ్యాధులకు చికిత్సలు, 27 దూడలకు నట్టల నివారణ మందులు, 13 పశువులకు సాధారణ చికిత్సలు అందించారు. అనంతరం పాడి రైతులకు ఖనిజలవణ మిశ్రమాలను అందజేశారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ సిబ్బంది వెంకటగిరి, ఓబులేసు, నరసింహులు, రైతులు పాల్గొన్నారు.

## యూరియా అధిక ధరకు విక్రయించరాదు

చాపాడు : వ్యాపారులు యూరియా,ఎరువులను రైతులకు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి దేవి పద్మలత పేర్కొన్నారు. చాపాడులోని మూడు ప్రైవేట్ ఫర్టిలైజర్ దుకాణాలతో పాటు అల్లాడుపల్లె రైతు సహకార సంఘం వద్ద సోమవారం ఎరువుల పంపిణీని పరిశీలించారు. ఇదే క్రమంలో ఎరువులకు సంబంధించిన రికార్డులను, క్రయ, విక్రయాల రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ఎరువుల దుకాణాల వద్ద ధరల పట్టికను పొందుపరచాలని, ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు రశీదులను తప్పనిసరిగా అందజేయాలని, రశీదులు లేని ఎరువులను తరలిస్తే సీజ్‌చేయడం జరుగుతుందన్నారు.

## అవోపా ఆధ్వర్యంలో ఉచిత హోమియో వైద్య శిబిరం

బద్వేలు అర్బన్ : స్థానిక అమ్మవారిశాలవీధిలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో సోమవారం ఆర్యవైశ్య అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) ఆధ్వర్యంలో ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. అలాగే నిరుపేద ఆర్యవైశ్యులకు పెన్షన్లు పంపిణీ చేయడంతో పాటు దసరా సందర్భంగా దుస్తులు పంపిణీ చేశారు. ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షుడు కొండపల్లిచిన్న సుబ్బారావు, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రైస్‌మిల్‌ప్రసాద్, అవోపా అధ్యక్షుడు రెడ్డెయ్య, ట్రెజరర్ తులసిసుబ్రమణ్యం, హోమియో వైద్యులు డాక్టర్ నాగశివాని పాల్గొన్నారు.